సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 3 । జూన్ । 2023



ఎర్రస్మగ్లర్లపై దాడులు

నలుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడు ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. -8లో..



ఆ హెడ్‌మాస్టర్ వద్దంటూ నిరసన

వివాదాస్పద హెడ్‌మాస్టర్‌ను నియమించ వద్దని గాలివీడులో గ్రామస్తులు పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.180
రెండోరకం	రూ.80	రూ.118

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1431 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రశాంతంగా పది సప్లిమెంటరీ పరీక్షలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలలో జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాలలో 1642 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 2149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. అయితే 507 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. ఇకపై జరగనున్న పరీక్షలను కూడా కట్టుదిట్టంగా నిర్వహిస్తామని డీఈఓ తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో 30 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు ఆర్‌సెట్ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని.. ఈనెల 5వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభిస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు అరుణాచలానికి ఏసీ ఇంద్ర బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమిని పురస్కరించుకుని కడప డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలానికి ఏసీ ఇంద్ర బస్సు నడుపుతున్నామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సర్వీసు 93800కు ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. పెద్దలకు రూ. 1350, పిల్లలకు రూ. 1040గా టిక్కెట్‌గా నిర్ణయించామన్నారు. శనివారం రాత్రి 9.30 గంటలకు కడపలో బయలుదేరి మరుసటిరోజు ఉదయానికి అరుణాచలానికి చేరుతుందన్నారు. తిరిగి ఆదివారం రాత్రి 8.00 గంటలకు అక్కడ బయలుదేరి మరుసటిరోజు ఉదయం కడపకు చేరుతుందన్నారు. రిజర్వేషన్ కౌంటర్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో సీట్లను రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

9న గోవాకు ఆర్టీసీ స్పెషల్ యాత్ర

పీలేరు రూరల్ : ఈ నెల 9న పీలేరు నుంచి గోవాకు మూడు రోజుల ఆర్టీసీ స్పెషల్‌యాత్ర సర్వీసు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. శుక్రవారం స్పెషల్ యాత్రకు సంబంధించి పట్టణంలో పలు చోట్ల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 9న సాయంత్రం 4 గంటలకు పీలేరు నుంచి బస్సు బయలుదేరి మురడేశ్వర్, గోకర్ణం, బీచ్ అక్కడి నుంచి గోవాకు వెళుతుందన్నారు. సందర్శన అనంతరం 12వ తేదీ రాత్రికి పీలేరు చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర రూ.3200గా నిర్ణయించామన్నారు. యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు మార్కెటింగ్ టీమ్ కె.వి.రమణ 7893152748, ప్రమీల 7382878751 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

9న ఊటీకి స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ : వేసవి సెలవులు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 9న ఊటీకి స్పెషల్ బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్సీ నిరంజన్ తెలిపారు. 9న రాత్రి మదనపల్లె నుంచి బయలుదేరి బెంగళూరు, మైసూర్ మీదుగా 10న ఉదయం ఊటీకి చేరుతుందన్నారు. 11న ఉదయం ఊటీ నుంచి బయలుదేరి పైకార షూటింగ్ స్పాట్, ముదుమలై ఫారెస్టు, బండిపూర్ ఫారెస్టు మీదుగా మైసూర్‌కి వెళ్లి ప్యాలెస్, జూ పార్కు, బృందావన గార్డెన్స్ చూసుకున్న తరువాత అదే రోజు రాత్రి బయలుదేరి 12న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను,పోను చార్జీలు రూ.2250 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

రిమ్స్‌లో ఎన్‌ఎంసీ బృందం పర్యటన

కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)లో ఈఎన్‌టీ (చెవి,ముక్కు, గొంతు) విభాగంలో పీజీ సీట్ల గుర్తింపు కోసం నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. కర్ణాటకలోని మాండ్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈఎన్‌టి హెచ్‌ఓడిగా పనిచేస్తున్న డాక్టర్ హనుమంత్ ప్రసాద్ తదితరులు ఆయా విభాగాలను పరిశీలించడంతో పాటు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ విభాగంలో ఇప్పటికే మూడు పీజీ సీట్లు వున్నాయి. వీటిలో ఒక సీటుకు గుర్తింపు లభించింది. మరో రెండు సీట్ల కోసం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, ఈఎన్‌టీ హెచ్‌ఓడీ డాక్టర్ భాస్కరన్, డాక్టర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక యంత్రం.. రైతుకు వరం

- జిల్లాలో వంద ట్రాక్టర్లు, 370 వ్యవసాయ పరికరాల పంపిణీ
- తక్కువ ధరకే ఆధునిక యంత్ర పరికరాలను అందిస్తున్న ప్రభుత్వం
- అన్నదాతల సంక్షేమమే ధ్యేయం
- కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



యంత్రాల పంపిణీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ , ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జేసీ, మునిసిపల్ చైర్మన్ తదితరులు

రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్‌ఆర్ యాంత్రీకరణ వ్యవసాయ సేవలతో రైతన్నలకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ యంత్ర సేవా పథకం మెగా మేళా-2 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ కార్యక్రమం ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నేడు వ్యవసాయ సాగు రంగంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సాగు, దిగుబడులలో పోటీతత్వం వేగం పెరుగుతోందన్నారు. వీటిని అందిపుచ్చుకొని వ్యవసాయంలో రైతన్నలు లాభాల బాట పట్టేలా ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. ఇందులో భాగంగానే వైఎస్‌ఆర్ యంత్ర సేవా పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే సన్న, చిన్నకారు రైతులకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారికి సాగు వ్యయం తగ్గించి నికర ఆదాయం పెంచాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు అనుగుణంగా వైఎస్‌ఆర్ యంత్ర సేవా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అన్నమయ్య జిల్లాలో 161 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.11.385 కోట్ల ఖర్చుతో రూ.3.836 కోట్ల రాయితీపై 100 ట్రాక్టర్లు, 370 వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం రైతన్నకు వెన్నుదన్నుగా నిలవడంతో పాటు ఆర్బీకేల పరిధిలో 10, 15 మంది రైతులతో గ్రూపులు ఏర్పాటు చేసి యంత్రసేవా కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు.

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాతల సాగు అవసరాలను తీర్చి, యాంత్రీకరణ ద్వారా సాగు వ్యయం తగ్గించి, నికర ఆదాయం పెంచాలనేది ప్రభుత్వ ఆశయమన్నారు. రైతన్నలు గ్రూపులుగా ఏర్పడి కేవలం పది శాతం డబ్బులు కడితే చాలు, 40 శాతం సబ్సిడీ, 50 శాతం రుణంతో వారికి యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలను జగనన్న ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వ్యవసాయరంగంలో కూలీల కొరత ఉందన్నారు. రైతు యంత్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకున్న మన ముఖ్యమంత్రి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి యంత్ర సేవా పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నారన్నారు. డ్రిప్పు, చాప్‌కట్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు తదితరాలను రాయితీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వం రైతన్నలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ట్రాక్టర్లను నడుపుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

- అనంతరం వైఎస్‌ఆర్ యంత్రసేవా పథకంలో భాగంగా జిల్లాలో 100 ట్రాక్టర్లు, 370 వ్యవసాయ పరికరాలను లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రూ.3.836 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.
- ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏ లక్ష్మీసువర్ణ, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాకు ఎకరం భూమి ఉంది. గతంలో టమోటా, వంకాయ పంటలు వేసే వాడిని. ఈసారి టమోటా పంట వేస్తాను. పంటసాగుకు ముందు బాడుగ ట్రాక్టర్‌కు గంట రూ.1100 ఇచ్చి దుక్కి దున్నించుకునే వాడిని. ఇప్పుడు మాజగనన్న యంత్ర సేవా పథకం కింద ఈ ట్రాక్టర్ వచ్చినందువలన నేను నా పొలం పనులు చేసుకొని, పొరుగు పొలం కూడా మిగిలిన వారి ధరకన్నా తక్కువ ధరకు దుక్కి చేసిస్తాను. రైతన్నలను ఇంతలా మేలు చేస్తున్న జగనన్నకు పాదాభివందనం.

– సి. బయన్న, రైతు, వేంపల్లె, మదనపల్లె మండలం



నాకు 4 ఎకరాల పొలం ఉంది. అందులో వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తా. భూమి దున్నుకోవాలన్నా, ముందు ట్రాక్టర్ గంటకు రూ.1000 నుండి రూ.1200 బాడుగకు తీసుకొని దున్నించుకునే వాడిని. ఇప్పుడు వైఎస్‌ఆర్ యంత్ర సేవా పథకం కింద శ్రీ వెంకటేశ్వర రైతుమిత్ర గ్రూపు ద్వారా రూ.6.8 లక్షలు విలువ చేసే ట్రాక్టర్‌ను రూ.2 లక్షల సబ్సిడీతో మాకు అందజేశారు. ఇప్పుడు నా పొలంతో పాటు గ్రూపులో భూములు ఉన్న వారికి కూడా తక్కువ ధరతో పొలం పనులు చేసుకొనే అవకాశం కల్పించిన జగనన్నకు ధన్యవాదాలు.

– సి.సుబ్బారెడ్డి, రైతు, గ్యారంపల్లి , కేవీ పల్లి మండలం



నాకు 20 ఎకరాల భూమి ఉంది. జామ, మామిడి, అల్లనేరేడు తోటలు వేసాను. ఇంకొంత భూమిలో వరి వేస్తాను. ఈ పంటల మధ్యలో అంతర పంటలు వేసుకునేదానికి పెద్ద పెద్ద ట్రాక్టర్‌తో దున్నడానికి వీలయ్యేది కాదు. కూలీలతో పనులు చేయిస్తే ఖర్చు చాలా అయ్యేది. అందుకని కొన్ని రోజులు అంతర పంట నిలిపివేశాను. జగనన్న యంత్ర సేవా పథకం తీసుకొచ్చి మాకు చాలా మేలు చేశారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర గ్రూప్ ద్వారా రూ.3 లక్షలతో చిన్న ట్రాక్టర్ మిల్లర్ తీసుకున్నాను. ఇప్పుడు చాలా సులభంగా ఈ తోటల మధ్య అంతర్ పంటలు వేసుకోవడానికి వీలవుతుంది.

– డి.ఈశ్వర్‌రెడ్డి, రైతు, ఓదివీడు , వీరబల్లి మండలం

గాలివాన బీభత్సం



రామసముద్రంలో గాలివానకు నేలమట్టమైన కోళ్లఫారం షెడ్డు



ఇంటిపై పడిన చెట్టు

- నేలమట్టమైన కోళ్లఫారాలు
- రూ.15 లక్షలు ఆస్తి నష్టం

రామసముద్రం: రామసముద్రం మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. కుదురుచీమనపల్లె , వనగానిపల్లి, గుంతయంబాడి ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గాలివానకు కెసి.పల్లికి చెందిన రైతు ఆర్.సతీష్‌రెడ్డికి చెందిన మూడు కోళ్లఫారాలు షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.15 లక్షలు వరకు నష్టం వాటిల్లింది. షెడ్లు నేలమట్టమైపోవడంతో ఆరైతు కన్నీరు మున్నీరయ్యాడు. సంఘటన స్థలాన్ని తహశీల్దార్ దైవరాజన్ , ఆర్ఐ, వైస్ ఎంపీపీ రమణారెడ్డిలు పరిశీలించి నష్టం అంచనా వేశారు.



గాలివానకు నేలకొరిగిన చెట్లు

- గాలివానకు మామిడి , మొక్కజొన్న, బొప్పాయి, టమోటా పంటలు దెబ్బతిన్నాయి. పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయి. కెసి.పల్లెలో ఇంటిపై చెట్టు పడిపోవడంతో ఇల్లు దెబ్బతింది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తరచూ తనిఖీలను నిర్వహిస్తూ బాలలను పనిలో పెట్టుకున్నవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 1వ తేదీ నుంచి 30 వరకు జిల్లాలో బాల కార్మికులను గుర్తించి, వారిని పనిలో పెట్టుకున్న యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వశాఖలలో పనిచేస్తున్న ఎన్‌ఎంఆర్-మజ్దూర్ కార్మికులకు కనీస వేతనం నిర్ధారించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా లేబర్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జ్ అధికారి డివి రంగరాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమూర్తి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, డీఆర్‌డీపీడీ సత్యనారాయణ, డీపీఓ ధనలక్ష్మీ, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఉమా మహేశ్వరమ్మ, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

నాడు-నేడు పనులు వందశాతం పూర్తి చేయాలి

నాడు-నేడు పనులు వందశాతం పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో మనబడి, నాడు-నేడు రెండో దశ పనులు, టాయిలెట్స్, కిచెన్ షెడ్, మేజర్ అండ్ మైనర్ రిపేర్ తదితర పనులు పురోగతిపై హెడ్‌మాస్టర్లు, ఎంఈఓలు, ఎంపీడీఓలు, ఫీల్డ్ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డీఈఓ పురుషోత్తం, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ ప్రసన్న కుమార్, పీఎస్‌డబ్ల్యూఎస్ ఏఓ మనోహర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లను త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాల (విలేజ్ హెల్త్ క్లినిక్స్)ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లాలో చేపట్టిన వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ కేజీఎన్ చంద్రారెడ్డి, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి

జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల స్థాపన విరివిగా జరగాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజ, ఏపీఐఐసీ జెడ్‌ఎం మూర్తి, ఎల్‌డీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాండ్రింపులులు

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 8-10 మధ్య పులులు
- శ్రీశైలం బయోల్యాబ్‌లో విశ్లేషణ ప్రక్రియ
- డేటాలోని చిత్రాలు పరిశీలన
- ఎఫ్‌డీపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన పులుల గణన
- వివిధ రేంజిలలో 376 కెమెరాలు ఏర్పాటు

రాజంపేట: శ్రీశైలం నుంచి శేషాచలం వరకు విస్తరించి ఉన్న అభయారణ్యంలో పులుల గాండ్రింపులు వినిపిస్తున్నాయి. వైఎస్సార్, అన్నమయ్య, గిద్దలూరు, తిరుపతిలో టైగర్ కారిడార్ కొనసాగుతోంది. నాగార్జున సాగర్‌లోని శ్రీశైలంలో టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలో గుండ్ల బ్రహ్మేశ్వర వైల్డ్‌లైఫ్ అభయారణ్యం నుంచి టైగర్ కారిడార్ ప్రారంభమైంది.

పులుల గణన...

శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు (ఎఫ్‌డీపీసీ) ఆధ్వర్యంలో పులుల గణన చేపడుతున్నారు. పులుల గణన రెండు బ్లాకులలో జరుగుతుంది. నాలుగేళ్లకొకసారి చేసే గణన బ్లాక్-3లోకి వస్తుండగా , ప్రతి ఏడాది జరిపే గణన బ్లాక్-4 కిందికి వస్తుంది. ఇటీవల బ్లాక్-4లోని వార్షిక గణనలో టైగర్ కారిడార్ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి అటవీ శాఖాధికారుల గణన ప్రక్రియ ప్రారంభమైంది.

పెరుగుతున్న పులుల సంఖ్య..

2021లో ఆరు పులులు ఉండగా, 2022లో వాటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు అటవీ వర్గాల సమాచారం. 2019లో బద్వేలు, సిద్ధవటం అటవీ ప్రాంతాల్లో కూడా పులులు ఉండేవని అప్పటి సమాచారం. ఈ సారి గణనలో అవి కెమెరాలకు చిక్కలేదు. అయితే పెనుశిల అభయారణ్యం, శేషాచలం అటవీ ప్రాంతాల వైపు వెళ్లినట్లు అటవీవర్గాలు భావిస్తున్నాయి.



ఎక్కడెక్కడ..

టైగర్ కారిడార్ నంద్యాల, గిద్దలూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి డివిజన్లలో నిర్వహించారు. నంద్యాల డివిజన్‌లోని చలమరుద్రవరం (రేంజ్), గిద్దలూరులో గుండ్లకమ్మ, వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు, వనిపెంట, పోరుమామిళ్ల, బద్వేలు, సిద్ధవటం, ఒంటిమిట్ట, ముద్దనూరు, అన్నమయ్య జిల్లాలో చిట్వేలు, రాయచోటి , బాలపల్లె తిరుపతి జిల్లాలో భాకరాపేట, తిరుపతి రేంజిలోని అటవీ ప్రాంతాల్లో సాంకేతిక డిజిటల్ కెమెరాలు అమర్చి సర్వే చేశారు.

డేటాలో చిత్రాలు శ్రీశైలం బయోల్యాబ్‌కు ..

ఆయా రేంజిలలో 188 లోకేషన్లకు గాను మొత్తం 376 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 127 కెమెరాలు అమర్చారు. 40 రోజుల పాటు జరిగిన గణనలో 20 రోజులకొక సారి కెమెరాలు తీసి వాటిలోని చిత్రాలను సేకరించారు. అదే ప్రదేశాలలో మళ్లీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

మార్చినెలాఖరుకు గణన పూర్తి...

రెండవ విడతలో జరిపిన గణన మార్చినెలాఖరు నాటికి పూర్తికావడంతో అన్ని డివిజన్‌లలో అమర్చిన కెమెరాల్లోని డేటాను ఆయా అటవీశాఖాధికారులు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపారు. వాటిలోని చిత్రాలను బయోల్యాబ్ ప్రతినిధులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. పోరుమామిళ్ల, వనిపెంట అడవుల్లో ఆరు పులులు కెమెరాలకు చిక్కినట్లుగా అటవీ అధికారుల నుంచి అందిన ప్రాథమిక సమాచారం.

ప్రాథమికంగా 8 నుంచి 10 పులుల సంచారం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని టైగర్ కారిడార్ చేపట్టిన పులుల గణనలో ప్రాథమికంగా 8 నుంచి 10 లోపు పులులను అధికారులు గుర్తించారు. పులుల వార్షిక గణనలో భాగంగా అడవుల్లో అమర్చిన విదేశీ సాంకేతిక డిజిటల్ కెమెరాల ద్వారా వాటి సంఖ్యను కొనుగొన్నారు. పలుల గణన ప్రక్రియ ఇటీవల ముగియగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మొత్తం ఎన్ని పులులు ఉన్నాయో పక్కాగా నిర్ధారించే పరిస్థితులు ఇంకా కనిపించడంలేదు. దానికి శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌లో శాస్త్రవేత్తలు కెమెరాల్లో లభ్యమైన చిత్రాలపై విశ్లేషణ చేసి నిర్ధారించనున్నారు.

కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు టైగర్ ల్యాబ్‌కు పంపాం



జిల్లాలోని పలు రేంజ్‌లలో పులుల గణన నిమిత్తం కెమెరాలను ఏర్పాటుచేశాం. టైగర్ జాడ కోసం ఏర్పాటుచేసిన కెమెరాల్లో లభ్యమైన చిత్రాలు శ్రీశైలంలోని టైగర్ బయోల్యాబ్‌కు పంపాం. డేటాలోని చిత్రాల పరిశీలన కొనసాగుతోంది. పులుల సంఖ్య త్వరలో వెల్లడవుతుంది. – పీవీ సందీప్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, కడప

పర్యావరణానికి హాని కలిగించవద్దు



విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ

కడప కార్పొరేషన్: పర్యావరణానికి హాని కలిగించని రీతిలో మానవ జీవన శైలి ఉండాలని విద్యుత్ శాఖ(ఆపరేషన్) పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో పర్యావరణాన్ని రక్షించడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ లైఫ్ (లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమం నిర్వహించి, అధికారులు, ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనరులను వివేకం లేని, విధ్వంసకర వినియోగానికి బదులుగా బుద్ధి పూర్వక, ఉద్దేశపూర్వక వినియోగం కోసం 'లైఫ్' అనే మహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలు ప్రకృతితో సమకాలికమైన, హాని కలిగించని జీవన శైలిని ఆచరించాలన్నారు. ఇందులోభాగంగా విద్యుత్ ఆదా చేయుటకు ఎల్‌ఈడీ బల్బులు వాడటం, ఎయిర్ కండీషనర్ల ఉష్ణోగ్రత 24 డిగ్రీల వద్ద ఉంచడం, నీటిని చల్లబరుచుకోవడానికి రిఫ్రిజిరేటర్‌కు బదులు కుండలు వాడటం, తరచుగా వాడే ఎలక్ట్రానిక్ వస్తువులకు స్మార్ట్ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవడం, గ్రీజర్ల స్థానంలో సోలార్ హీటర్లు వాడటం, పగటిపూట లైట్లు, ఫ్యాన్లకు బదులు సహజ గాలిని, వెలుతురును వాడుకోవడం వంటి పద్ధతులు పాటించాలన్నారు. ప్రజా రవాణాకు ఇంధన ఖర్చు తగ్గించడం, స్వల్ప దూరాలకు సైకిల్ వాడటం, ట్రెడ్‌మిల్‌కు బదులు బయట పరుగెత్తడం వంటివి చేయాలన్నారు. మొక్కలను విరివిగా పెంచాలన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. నక్కలదిన్నెకు చెందిన గిరిప్రసాద్ భార్య యశోద(28) కుటుంబసమస్యల కారణంగా మనస్తాపం చెంది విషద్రావణం తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఐసీయూ విభాగంలో చికిత్సలు అందిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

కుటుంబసమస్యలతో..

కుటుంబసమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన మహబూబ్‌బాషా(47) కుటుంబసమస్యల కారణంగా బాడీ స్ప్రేను తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహన ప్రమాదంలో కార్పెంటర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ములకలచెరువు మండలంలో జరిగింది. కాలువపల్లెకు చెందిన బాబాఫకృద్దీన్(25) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి భార్య ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో బిడ్డను ప్రసవించడంతో ఆమెను డిశ్చార్జి చేసుకుని ఇంటికి తీసుకెళ్లేందుకు మదనపల్లెకు వచ్చాడు. భార్యాపిల్లను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పంపించి, బాబాఫకృద్దీన్ తన ద్విచక్రవాహనంలో గ్రామానికి బయలుదేరాడు. కాలువపల్లెకు కిలోమీటరుకు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆలయ ప్రహరీపై కూలిన రావిచెట్టు



రహదారిపై పడిన రావిచెట్టు

మదనపల్లె : పట్టణంలోని దేవళంవీధి శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం ఉత్తర ద్వార ప్రహరీపై శుక్రవారం వేకువజామున రావిచెట్టు కూలి పడింది. రెండుముక్కలుగా చీలి నేలకొరిగింది. విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెట్టు కూలిన కారణంగా దేవళంవీధి నుంచి ఆర్యవైశ్యాహాస్టల్, మధుసూధన థియేటర్ వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి. చెట్టు కూలిన సమయం రాత్రివేళ కావడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది తెగిపడిన విద్యుత్‌తీగలను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. మున్సిపల్ సిబ్బంది రావిచెట్టు కొమ్మలను తొలగించి దారి సమస్యను పరిష్కరించారు.

ఎర్రస్మగ్లర్లపై దాడులు

- నలుగురు అరెస్ట్. ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- నిందితుల్లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ)



ఎర్రచందనం అక్రమ రవాణా నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం లంకమల్ల అటవీప్రాంతం నుంచి ఎర్రచందనం చెట్లను అక్రమంగా నరికి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై పోలీసులు నిఘా ఉంచారు. ఇదే మండలం యాకర్లపాలెం గ్రామం సమీపంలోని తెలుగుగంగ రిజర్వాయర్ సీ- బండ్ వద్ద కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను వాహనంలోకి లోడ్ చేస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. వారిలో కొందరు పోలీసులపై రాళ్లదాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించగా నలుగురిని అరెస్ట్ చేశారు. శుక్రవారం కడపలోని పెన్నార్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. అరెస్టయిన వారిలో తమిళనాడు రాష్ట్రంలో తిరువన్నామలై జిల్లా ముత్నతూర్ గ్రామానికి చెందిన వెలిముత్తు తంగరాజు, పోలూరు తాలూకా బర్కుర్ గ్రామానికి చెందిన వెల్లియన్ సౌందర్ శంకర్, వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం పెద్ద లేవాకు గ్రామం పెరికల రాజశేఖర్, ఖాజీపేట మండలం ముత్తలూరుపాడు గ్రామానికి చెందిన టి. రామసుబ్బారెడ్డి ఉన్నారు. వీరిలో రాజశేఖర్ గతంలో 2004- 2013 వరకు రైల్వేకోడూరులో ఫారెస్ట్ గార్డ్‌గా పనిచేశాడు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహకరించడంతో ఇతనిపై కేసు నమోదు చేసి విధుల నుంచి తొలగించారు. అనంతపురం జిల్లా పెనుగొండలో ఒక ఎర్రచందనం కేసు ఉంది. ఇతనితో పాటు అరెస్టయిన టి. రామసుబ్బారెడ్డి గంజికుంట సెక్షన్, నీలాపురం బీట్ ఆఫ్ వనిపెంట రేంజ్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. స్మగ్లర్ల నుంచి 300 కిలోల బరువున్న ఏడు ఎర్రచందనం దుంగలను, కారును, ద్విచక్రవాహనాన్ని నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, మైదుకూరు డిఎస్పీ వంశీధర్‌గౌడ్, టాస్క్‌ఫోర్స్, ఫ్యాక్షన్ జోన్ డిఎస్పీ చెంచుబాబుల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సీఐ ఎం. నాగభూషణ్, మైదుకూరు అర్బన్ సీఐ బి.వి. చలపతి, టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, టీం సభ్యులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

దుంగలు తరలిస్తే కఠిన చర్యలు: ఎస్పీ

జిల్లాలో ఎర్రచందనం చెట్లను నరికినా, దుంగలుగా చేసి అక్రమంగా తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామనీ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు..జిల్లాలో ఈ ఏడాది అరెస్టయిన ఎర్రచందనం స్మగ్లర్లలో ఇప్పటివరకు ఏడుగురిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించామనీ జిల్లా ఎస్పీ తెలియజేశారు.

33 దుంగల పట్టివేత

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామంలో గురువారం రాత్రి కడప టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు ముందుగా తెలిసిన సమాచారంతో రాచకొండు రామయ్య ఇంటిపై దాడి చేసి 33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుడు పరారయ్యాడని, అతను గతంలో పోరుమామిళ్ల అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా 3 సంవత్సరాలు పని చేసినట్లు తెలిసింది. గంగాయపల్లె, రామేశ్వరం, టేకూరుపేట చెక్‌పోస్టు పరిధిలో పనిచేసిన అతను ఎర్రచందనం గురించి బాగా తెలుసుకొని, ఓ గ్రూపు తయారు చేసుకొని స్మగ్లింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

అట్లూరు మండల పరిధిలో 26 దుంగలు స్వాధీనం

అట్లూరు : మండల పరిధిలో గురువారం రాత్రి అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన 26 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బద్వేలు, అట్లూరు మండల పరిధిలోని పలువురు ఎర్రచందనం దొంగలను టాస్క్‌పోర్సు పోలీసులు అదుపులోకి తీసుకు విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు పెనుశిల నరసింహా అభయారణ్యం పరిధిలోని ముత్తుకూరు బీట్‌లో గంగప్ప భావి దగ్గర రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 26 దుంగలను స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయమై సిద్దవటం రేంజ్‌అధికారి ప్రసాద్‌ను వివరణ అడుగగా దుంగలు దొరికిన విషయం వాస్తవమే అన్నారు. అవి టాస్క్‌పోర్సు పోలీసుల ఆధీనంలో ఉన్నాయని తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఎస్ఈబీ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు



గాయపడిన సురేంద్రబాబు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఎస్ఈబీ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. రామసముద్రం మండలం కురప్పల్లెకు చెందిన సి.సురేంద్రబాబు(32) మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి యథావిధిగా డ్యూటీ ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా కొత్తపల్లె వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితున్ని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అప్పులబాధతో ఆత్మహత్య

పెద్దముడియం : వైఎస్సార్ జిల్లా దిగువ కల్వటాల గ్రామంలో గువ్వల గురప్ప(54)అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గురప్పకు భార్య,ఇద్దరు కుమారులు,కుమార్తె ఉన్నారు. తన సొంత భూమి 2.5 ఎకరాలు, కౌలుకు 5 ఎకరాలు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.గతంలో పంటలు సరిగా పండకపోవడం ,ఈ ఏడాది అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నటంతో రూ.10 లక్షల మేర అప్పు అయింది.అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడం, తీర్చలేనేమోనని మనోవేదనతో గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని అత్మహత్య చేసుకున్నాడు.

ఒంటరి తనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య



మదన్‌మోహన్ గుప్తా (ఫైల్)

ములకలచెరువు : ఒంటరి తనం భరించలేక ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని చౌడసముద్రంకు చెందిన పుట్టా రమణప్ప కుమారుడు పుట్టా మదన్‌మోహన్ గుప్తా(60) హార్డ్‌వేర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. మదన్‌మోహన్ భార్య సుజాత నెల్లూరులోని తన తల్లి కృష్ణవేణికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నెల్లూరులో ఉంటోంది.మదన్‌మోహన్ పిల్లలు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం వ్యాపారార్థం కారులో చిత్తూరు జిల్లా పలమనేరు వైపు వెళతుండగా గుర్తు తెలియని వారు కారును ఆపి మదన్‌మోహన్‌పై రాళ్లదాడికి పాల్పడ్డారు. అప్పటి నుంచి ఆయనకు మతిస్థిమితం సరిగా లేనందున ప్రతి విషయానికి ఆందోళన చెందుతున్నట్లు పోలీసులకు అందజేసిన ఫిర్యాదు ద్వారా తెలిసింది. అప్పుడప్పుడు ఒంటరితనం భరించలేనని తాను చనిపోతానని చెబుతూ ఉండేవాడని చెప్పారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో మదన్‌మోహన్ గుప్తా భార్యకు ఫోన్ చేసి చనిపోతున్నట్లు చెప్పి, నిద్ర మాత్రలు మింగినట్లు చెప్పాడన్నారు.గమనించిన చుట్టుపక్కల వారు అతనిని వెంటనే తంబళ్లపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నజీర్ తెలిపారు.

ఆ హెడ్‌మాస్టర్ వద్దంటూ నిరసన



పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

గాలివీడు : తమ పిల్లలు చదువుకునే పాఠశాలలో వివాదాస్పద హెడ్‌మాస్టర్‌ను నియమించవద్దని శుక్రవారం గ్రామస్తులు పాఠశాల ముందు నిరసనను వ్యక్తం చేశారు. వివరాలు.. గాలివీడు మండలం పెద్దూరులోని ఉర్దూ హైస్కూల్‌కు పెనగలూరు మండలం ఎస్ఆర్‌పురం జెడ్పీహెచ్ఎస్ హెడ్‌మాస్టర్ ఇ.కృష్ణానాయక్‌ను విధుల్లో చేరాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. గతంలో ఈయన విధులు నిర్వహించిన పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉన్నతాధికారుల చర్యలకు బాధ్యుడయ్యాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిని ఇక్కడ నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, నియమాక ఉత్తర్వులనున వెంటనే ఉపసంహరించుకోవాలని గాలివీడు -1 ఎంపీటీసీ తాజున్నిసా, మాజీ సర్పంచ్ రియాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



అశోక్‌కుమార్ మృతదేహం

రామాపురం : రామాపురం మండల పరిధిలోని చిట్లూరు గ్రామ పంచాయితీ పాలన్నగారిపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్‌కుమార్ (29) అక్కడిక్కడే మృతి చెందాడు.పోలీసుల కథనం మేరకు వివరాలు.. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న ఏపీ04యుఏ 1883 గల 407 మినీ లారీ పాలన్నగారిపల్లె పరుపుల ఫ్యాక్టరీ వద్దకు రాగానే రాయచోటి నుంచి వస్తున్న ఏపీ39యూకే 3391 గూడ్స్ ఆటోను ఢీ కొనడంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ చిట్లూరు మాలపల్లెకి చెందిన అశోక్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. బాలిపోగు శ్రీరాములుకు కాలు విరిగింది. మృతుడు అశోక్‌కుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీరాములకు కాలు విరగడంతో చికిత్స నిమిత్తం రాయచోటికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

కాలం చెల్లిన వాహనాలు సీజ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 15 సంవత్సరాలు దాటిన వాహనాలపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కాలం చెల్లిన వాహనాలను తుక్కు కింద పరిగణించాలని రవాణాశాఖకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు వాటిని సీజ్ చేస్తున్నారు. కాలం చెల్లిన వాహనాల్లో ఎక్కువగా మినరల్ వాటర్ తరలించే ఆటోలు ఉన్నాయి. సీజ్ చేసిన వాహనాలను రవాణాశాఖ కార్యాలయంలో ఉంచారు.

గంజాయి ముఠా అరెస్టు

- 21.6 కిలోల గంజాయి, బైక్‌లు స్వాధీనం
- అరెస్టయిన వారిలో చెన్నై సవిత ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్, చిత్రంలో గంజాయి ప్యాకెట్లు

కడప అర్బన్ : వైఎస్సార్‌జిల్లా కడప రూరల్ సర్కిల్ చింతకొమ్మదిన్నె పోలీసులు తమ సిబ్బందితో కలిసి ఏడుగురు సభ్యులున్న గంజాయి స్మగ్లర్ల ముఠాను అరెస్ట్ చేశారు.వీరిలో ముగ్గురు చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కూడా ఉన్నారు. శుక్రవారం కడపలోని ×పెన్నార్‌÷పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఈ సంఘటన వివరాలను తెలియజేశారు. జిల్లాలో గంజాయి విక్రయాల ముఠాలను అరెస్ట్ చేస్తూ నిరంతరం దాడులు చేస్తున్నామన్నారు. ఇటీవలి కాలంలో ఇద్దరిపై పీడీ యాక్ట్ ప్రయోగించామన్నారు. ఈ సంఘటనలో చింతకొమ్మదిన్నె పోలీసులు గంజాయి స్మగ్లింగ్ ముఠాలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. అరెస్టయిన వారిలో మైదుకూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తిరుపతి వెంకట శివారెడ్డి, గుంటూరు జిల్లా కొట్టం రాజు వీధికి చెందిన ప్రస్తుతం చెన్నైలో నివాసం ఉంటున్న వాగోలు రాహుల్, కడప నగరం అక్కాయపల్లి వీధికి చెందిన గంగిరెడ్డి హరిప్రసాద్ రెడ్డి ప్రధాన నిందితులన్నారు. వీరు ముగ్గురు చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతూ దురలవాట్లకు బానిసలుగా మారారన్నారు. మిగిలిన నిందితుల్లో కడప నగరం అక్కాయపల్లికి చెందిన మల్లప్పగారి మల్లికార్జున రెడ్డి, కడప నగరం నబీకోటకు చెందిన పాలగిరి పవన్‌కుమార్, కొట్టం ప్రతాప్, పెండ్లిమర్రి మండలం వెల్లటూరు గ్రామంకు చెందిన నరసింహులు ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి 21 కిలోల 600 గ్రాముల గంజాయిని, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి గంజాయిని కొనుగోలు చేసి చెన్నైకి స్మగ్లింగ్ చేసి, తరువాత అక్కడి నుంచి కడపకు అక్రమంగా తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయిస్తారన్నారు. ఇక్కడి నిందితులు కడప నగరంలో, చుట్టు ప్రక్కల ప్రాంతాలకు వెళ్లి గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ యువతను మత్తుకు బానిసలుగా మార్చేస్తున్నారన్నారు. గంజాయిని వినియోగించినా, అక్రమ రవాణాకు, విక్రయాలకు పాల్పడినా వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రస్తుతానికి గంజాయిని వినియోగిస్తున్న వారికి ×డీ ఆడిక్షన్‌÷కేంద్రాలకు పంపించి వారికి చికిత్సను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. విద్యాసంస్థల వద్ద మహిళా పోలీసులతో నిఘా వుంచామన్నారు. ఎవరైనా గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారాన్ని డయల్ 100 లేదా తన ఫోన్ నెంబర్: 94407 96900కు ఇవ్వాలనీ ఎస్పీ సూచించారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాజాప్రభాకర్, కడప తాలూకా సీఐ ఉలసయ్య, చింతకొమ్మదిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు విద్యాసాగర్, విశ్వనాథ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు జనార్దన్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినంచారు. నగదు రివార్డులను అందజేశారు.

43 మంది డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

వైఎస్సార్ జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న 43 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. - కడప సెవెన్‌రోడ్స్

పేరు	ప్రస్తుతం పనిచేస్తోంది	బదిలీ అయినది
ఆర్.రాజేష్‌కృష్ణ	కాశినాయన	సిద్దవటం
ఏవీ రమణమ్మ	కలసపాడు	బద్వేలు
కె.కృష్ణకుమార్‌రెడ్డి	బి.కోడూరు	బద్వేలు ఆర్డీఓ ఆఫీసు
కె.జాన్ విక్టర్ పాల్	బద్వేలు	బి.మఠం
వై.సంజీవరెడ్డి	బి.మఠం	పోరుమామిళ్ల
ఎస్.చంద్రలీల	చెన్నూరు	గోపవరం
డి.వెంకట రమణ	సిద్దవటం	చెన్నూరు
జి.రవిశంకర్	పెద్దముడియం	కలసపాడు
కె.త్రిభువన్‌రెడ్డి	వేముల	లింగాల
జి.విద్యాసాగర్	గోపవరం	బి.కోడూరు
పి.శేషారెడ్డి	లింగాల	వేముల
టి.భవాని	పోరుమామిళ్ల	చాపాడు
పి.రవిశంకర్	బద్వేలు	జీఎన్ఎస్ఎస్, ముద్దనూరు
పి.మల్లికార్జునరెడ్డి	పులివెందుల	స్పెషల్ కలెక్టర్ ఆఫీసు, కడప
పి.రూపేష్ మునిరావు	పులివెందుల	మైలవరం
ఆర్.మల్లికార్జున	కడప	ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల
టి.రెడ్డిలక్ష్మి	ముద్దనూరు	ఆర్డీఓ ఆఫీసు, పులివెందుల
పీఎంపీ మనోజ్	కడప	ఎన్‌ఫోర్స్‌మెంట్, కడప
వి.షఫీ	దువ్వూరు	జమ్మలమడుగు
పి.నరేంద్ర	పులివెందుల	కమలాపురం
ఆర్.బాబా ఫకృద్దీన్	బద్వేలు	మైదుకూరు
అజయ్‌బాబు	జమ్మలమడుగు	ప్రొద్దుటూరు
పి.శ్రీనివాస్	ఆర్డీఓ ఆఫీసు బద్వేలు	బద్వేలు ఎన్నికల విభాగం
వి.జగదీష్‌బాబు	పులివెందుల	పులివెందుల ఎన్నికల విభాగం
కె.శివారెడ్డి	కలెక్టరేట్	కడప తహసీల్దార్ ఆఫీసు
జె.కెజియ	అట్లూరు	ఖాజీపేట
జి.అమరేశ్వరి	కమలాపురం	ఆర్డీఓ ఆఫీసు, బద్వేలు
కె.అహల్య	సీకే దిన్నె	కమలాపురం
పి.లవన్‌కుమార్	ఒంటిమిట్ట	అన్నమయ్య జిల్లా
ఎస్ఎండీ రోషిన హుసేన్	ఖాజీపేట	అట్లూరు
కె.మీన	మైలవరం	కొండాపురం
జి.మౌనిక	ముద్దనూరు	కలెక్టరేట్
ఎస్.బాలకృష్ణ	కొండాపురం	సీకే దిన్నె
పి.అలీఖాన్	మైదుకూరు	దువ్వూరు
షేక్ అబ్దుల్ ఇస్మాయిల్	కమలాపురం	ముద్దనూరు
పి.అయ్యుబ్‌ఖాన్	పులివెందుల	ఒంటిమిట్ట
ఎన్.చంద్రమౌళి	కడప	కలెక్టరేట్
సి.గురప్ప	జీఎన్ఎస్ఎస్, ముద్దనూరు	తహసీల్దార్ ఆఫీసు ముద్దనూరు
బి.వేణుగోపాల్	ముద్దనూరు	జమ్మలమడుగు
కె.మేరి విజయకుమారి	పులివెందుల	కడప
పి.దేవకుమారి	కడప	పులివెందుల
వి.శ్రీకాంత్	వేముల	కమలాపురం
కె.సతీష్‌కుమార్	కమలాపురం	వేముల

అడవి కుక్కల దాడిలో పొడదుప్పి మృతి



మృతి చెందిన పొడదుప్పి

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామ శివారులోని పొలం వద్ద శుక్రవారం ఉదయం అడవి కుక్కల దాడిలో నాలుగు నెలల మగ పొడదుప్పి మృతి చెందిందని రేంజర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అడవిలోనుంచి పొడదుప్పి తాగునీటి కోసం గ్రామ శివారులోకి వచ్చింది. అడవి కుక్కలు తరుముకుంటూ వచ్చి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. స్థానిక రైతు సమాచారం ఇవ్వడంతో సిద్దవటం ఎఫ్‌బీఓ రాజశేఖర్ రెడ్డి మరికొందరు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిద్దవటం లోని పశువైద్య శాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సాబ్‌బావి బేస్ క్యాంపు వద్ద ఖననం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, అటవీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్థం చేసుకుంటేనే బంధంలో ఆనందం



భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటిటౌన్ : భార్యభర్తలు ఇద్దరు ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటేనే బంధం ఆనందమయమని, సంసారం సంతోషంగా సాగుతుందని అన్నమయ్యజిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. తన భర్త ప్రతి రోజు వేధిస్తున్నాడని ఒక మహిళ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. భర్త అమ్మ నాన్నలు, ఆడబిడ్డలు అందరూ వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై దిశ పోలీసులను ఆశ్రయించింది. దిశ సీఐ చంద్రశేఖర్ శనివారం జిల్లా ఎస్పీతో కలసి భార్య భర్తలను ఒకే వేదికపై కుర్చోపెట్టి మాట్లాడించారు. చివరికి వారి తప్పులను తెలుసుకొనేలా తెలియచెప్పారు. కుటుంబ వ్యవస్థ చాలా గొప్పదని దీనిని అర్థం చేసుకొంటేనే కాపురం సజావుగా సాగుతుందని విడమరిచి చెప్పారు. పూర్తిగా అర్థం చేసుకొన్న తరువాత ఇద్దరు సంతోషంగా ఇంటికి వెళ్లారు. వీరిని జిల్లా ఎస్పీ అభినందించారు.

లారీ, బొలెరో వాహనం ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడిన శేషాద్రి, కృష్ణయ్య

పీలేరురూరల్ : లారీ, బొలెరో పికప్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం గాలివారిపల్లె పంచాయతీ బొప్పసముద్రంకు చెందిన కె. శేషాద్రి (60), గాలివీడు మండలం వెలిగల్లు గ్రామం, ఇందుకూరివారిపల్లెకు చెందిన ఎం. కృష్ణయ్య (50) ఆస్పత్రిలో ఆరోగ్యం చూపించుకోవడానికి వేలూరు సీఎంసీకి వెళ్లారు. శుక్రవారం రాత్రి అక్కడి నుంచి స్వగ్రామాలకు వెళ్లడానికి పీలేరు చేరుకున్నారు. పీలేరు నుంచి రాయచోటి వైపు వెళుతున్న బొలెరో పికప్ వాహనం ఎక్కారు. అయితే మార్గమధ్యలోని పొంతలచెరువు క్రాస్ వద్ద బొలెరో, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బొలెరో డ్రైవర్ దేవపట్లకు చెందిన సికిందర్ సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు.

తప్పిన ప్రమాదం

అట్లూరు : కడప-బద్వేలు ప్రధాన రహదారిపై త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రయాణికులు, స్థానికుల కథనం మేరకు బద్వేలు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కడప నుంచి బద్వేలు వెళుతూ అట్లూరు క్రాస్‌రోడ్డులో ఆగింది. ప్రయాణికులను దింపుతుండగా ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ బస్సును క్రాస్ చేసే క్రమంలో ఎదురుగా ట్రాక్టరు వస్తుండడంతో టిప్పర్ డ్రైవర్ బ్రేక్ వేసి నిలిపివేశాడు. బస్సుకు, ట్రాక్టర్‌కు మధ్యలో టిప్పర్ దూరడం వల్ల బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.